క్లుప్తంగా

పనిచేసే వారికే ఫలితం

మాజీ ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి



రంగారెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిన వివిధ పార్టీల కార్యకర్తలు

యాచారం: పార్టీ బలోపేతంపై దృష్టి పెట్టాలని, అధికారంలోకి వస్తే కష్టపడి పనిచేసిన వారికే గుర్తింపు ఇస్తామని మాజీ ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి హామీ ఇచ్చారు. మండలంలోని అయ్యవారిగూడెం, గునుగల్ తదితర గ్రామాలకు చెందిన పలువురు రంగారెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తుందని, అనేక సర్వేల్లో తేలిందని వెల్లడించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలుచేస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై రాజీలేని పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. ప్రజా సమస్యలపై దృష్టి సారించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో యాచారం మండల పరిషత్ ఉపాధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, నల్లవెల్లి ఎంపీటీసీ లక్ష్మీపతిగౌడ్, మాజీ వైస్ ఎంపీపీ రామకృష్ణ, మంతన్‌గౌరెల్లి మాజీ ఎంపీటీసీ అరవింద్‌నాయక్ తదితరులు ఉన్నారు.

విద్యార్థులకు బ్యాగుల అందజేత



విద్యార్థులకు బ్యాగులు అందజేస్తున్న దాతలు

తుర్కయంజాల్: క్రమశిక్షణతో చదివిన విద్యార్థులు జీవితంలో ఉన్నత స్థానాల్లో స్థిరపడుతారని ఈతరం ఫౌండేషన్ వ్యవస్థాపకులు, ఇంజాపూర్ పాఠశాల పూర్వ విద్యార్థి దేవరకొండ ప్రసాద్ అన్నారు. ఇంజాపూర్‌లోని ఉన్నత పాఠశాలలో చదువుకుంటున్న 100 మంది విద్యార్థులకు మంగళవారం బ్యాగులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సోషల్ మీడియా, ఇంటర్నెట్‌ను సద్వినియోగం చేసుకుని విద్యలో రాణించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి సాయం



ఆర్థిక సాయం అందజేస్తున్న ట్రస్టు నిర్వాహకులు

తలకొండపల్లి: శిథిలమైన ఆలయాల మరమ్మతులతో పాటు, నూతన ఆలయాల నిర్మాణం కోసం సహాయ సహకారాలు అందజేస్తామని ఉప్పల చారిటబుల్ ట్రస్టు చైర్మన్, జెడ్పీటీసీ ఉప్పల వెంకటేశ్ అన్నారు. మండలంలోని పాతకోట తండాలో నూతనంగా ఆంజనేయ స్వామి ఆలయ నిర్మాణాన్ని చేపట్టారు. అయితే ఆర్థిక వనరులు లేక నిర్మాణం ఆగిపోయింది. నిర్మాణానికి సహకరించాలని తండా వాసులు జెడ్పీటీసీని ఆశ్రయించారు. దీంతో ఆలయ నిర్మాణానికి రూ. 17,000 వేలు అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ అలివేలు, జీర్యానాయక్, వార్డు సభ్యులు శ్రీను, గోపి, ధర్మ, తావ్ర్యానాయక్, సోమ్లానాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సహాయం

తలకొండపల్లి: మండలంలోని రాంపూర్ గ్రామానికి చెందిన లక్ష్మమ్మ (59) అనారోగ్యంతో మృతి చెందారు. అయితే విషయం తెలుసుకున్న ఉప్పల చారిటబుల్ ట్రస్టు చైర్మన్, జెడ్పీటీసీ ఉప్పల వెంకటేశ్, మాజీ ఎంపీపీ శ్రీనివాసుయాదవ్ మంగళవారం మృతురాలి కుటుంబసభ్యులను పరామర్శించారు. అనంతరం జెడ్పీటీసీ వ్యక్తిగతంగా రూ.3,000 మాజీ ఎంపీపీ రూ.3,000 ఆర్థిక సాయాన్ని అందజేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

షీ టీం సేవలపై అవగాహన



సమావేశంలో పాల్గొన్న ఎస్ఐ తదితరులు

మంచాల: మంచాల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో షీటీం అవగాహన సదస్సు మంగళవారం నిర్వహించింది. ఈ సమావేశంలో విద్యార్థులకు హ్యూమన్ ట్రాఫికింగ్, సైబర్ క్రైం, గుడ్‌టచ్, బ్యాడ్ టచ్, ఫేక్‌లోన్ యాప్స్, చైల్డ్ లేబర్, ఉమెన్స్ సేఫ్టీ గురించి అవగాహన కల్పించారు. ఎవరైనా వేధింపులకు పాల్పడితే 100, 8712662111 నంబర్‌కు వాట్సాప్ మెసేజ్ చేయాలని సూచించారు. విద్యార్థులు పరీక్షల సమయంలో అప్రమత్తంగా ఉండాలని, అపరిచిత వ్యక్తులకు ఫోన్ నంబర్లు ఇవ్వకూడదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో షీటీం ఎస్ఐ శ్రీనివాసులు, కానిస్టేబుల్ స్పందన, ప్రిన్సిపల్ తిరుపతయ్య, అధ్యాపకులు ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

ఎండకు ఎండుతూ.. వానకు తడుస్తూ



మైసిగండిలో బస్సుల కోసం నిరీక్షిస్తున్న ప్రయాణికులు

నిలువ నీడ కరవు

- ప్రయాణికులకు తప్పని నిరీక్షణ
- బస్సు షెల్టర్లు లేక పడిగాపులు
- దుకాణాలు, చెట్ల నీడే దిక్కు
- పట్టించుకోని అధికారులు
- ఇబ్బందులు పడుతున్న ప్రజలు

కడ్తాల్: ఆర్టీసీ ప్రయాణికులకు నిలువ నీడ కరువవుతోంది. ఎండకు ఎండుతూ వానకు తడుస్తూ రోడ్లపైనే బస్సుల కోసం పడిగాపులు కాయాల్సి వస్తోంది. మండల పరిధిలోని పలు గ్రామాల్లో బస్సు స్టేజీల వద్ద, బస్‌షెల్టర్లు లేక ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సమయానికి బస్సులు రాకపోవడంతో ఎండకాలంలో ఎండకు, వర్షాకాలంలో వానకు, చలికాలంలో చలికి గంటల తరబడి ప్రయాణికులు నిరీక్షిస్తున్నారు. గతంలో మైసిగండి, కర్కల్‌పహాడ్ గ్రామాల్లో బస్సు షెల్టర్‌లు ఉండేవి. రోడ్ల విస్తరణలో వాటిని అధికారులు తొలగించారు. దీంతో ప్రజలు రోడ్లపైనే బస్సుల కోసం ఎదురుచూస్తున్నారు. అదేవిధంగా మండలంలోని మక్తమాధారం, రావిచేడ్ వంపూగూడ, న్యామతాపూర్, చల్లంపల్లి, రేఖ్యతండా తదితర గ్రామాల్లో బస్ షెల్టర్‌లు నిర్మించకపోవడంతో ప్రయాణికులు, ఇబ్బందులు పడుతున్నారు. ఈ గ్రామాల నుంచి విద్యార్థులు, ఉద్యోగులు, వ్యాపారులు నిత్యం మండల కేంద్రం కడ్తాల్‌తో పాటు, ఆమనగల్లు, హైదరాబాద్ నగరాలకు రాకపోకలు సాగిస్తుంటారు. వీరంతా నిలువ నీడ లేక చెట్లు, రోడ్డు పక్కన షాపుల వద్ద బస్సుల కోసం వేచి చూస్తున్నారు. చార్జీల పేరుతో ప్రయాణికుల నుంచి డబ్బులు వసూలు చేస్తున్న ఆర్టీసీ అధికారులు.. సౌకర్యాల కల్పనపై దృష్టి సారించకపోవడంపై పలు విమర్శలు వస్తున్నాయి.

నిలబడటానికి నీడ లేదు



గ్రామంలో గతంలో బస్సు షెల్టర్ ఉండేది. ఐదేళ్ల క్రితం రోడ్డు విస్తరణలో షెల్టర్‌ను తొలగించారు. అప్పటి నుంచి ప్రయాణికులు బస్సుల కోసం రోడ్డుపైనే నిరీక్షిస్తున్నారు. నిలబడటానికి కనీసం నీడ కూడా లేదు. అధికారుల దృష్టికి తెచ్చినా పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా అధికారులు బస్ షెల్టర్ నిర్మించాలి.

– రమేశ్, కర్కల్‌పహాడ్

ప్రభుత్వం దృష్టి సారించాలి



గ్రామాల్లో బస్సు స్టేజీల వద్ద షెల్టర్ల నిర్మాణం చేపట్టేందుకు, స్థలాల సేకరణతో పాటు నిర్మాణానికి ప్రభుత్వం నిధులు కేటాయించాలి. గ్రామీణ ప్రాంత ప్రయాణికుల సౌకర్యం కోసం అదనంగా బస్సులు నడపాలి.

– పవన్, రావిచేడ్ గ్రామం

‘ఔట్‌సోర్సింగ్’ సమస్యలు పరిష్కరించాలి



కిషన్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న సీఐటీయూ నేతలు

ఇబ్రహీంపట్నం: మున్సిపాలిటీల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ సిబ్బందికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఇస్తున్నట్లుగా తెలంగాణ ప్రభుత్వం నెలకు రూ. 21 వేలు వేతనం ఇవ్వాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు కిషన్, స్వప్నలు డిమాండ్ చేశారు. సీఐటీయూ ఆధ్వర్యంలో మంగళవారం ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ కేటగిరి వారీగా వేతనాలు, 2వ పీఆర్సీ కమిషన్ సిఫారసుకు అనుగుణంగా మధ్యంతర భృతిని, రూ.5 లక్షల ప్రమాదబీమా ఇవ్వాలన్నారు. అర్హులైన ఉద్యోగులకు డబుల్ బెడ్ రూం ఇళ్లు మంజూరు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు ప్రకాష్‌కారత్, ఎల్లేశ్, బుగ్గరాములు, యాదగిరి, బాబు, జగన్, భాస్కర్, అండాలు, భారతమ్మ, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వం ఆదుకోవాలి



బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం అందజేస్తున్న అల్లాజీగౌడ్

కడ్తాల్: గౌడ కులస్తుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేయాలని కల్వకుర్తి నియోజకవర్గ గౌడసంఘం అధ్యక్షుడు అల్లాజీగౌడ్ ప్రభుత్వాన్ని కోరారు. గౌడ సంఘం నాయకుడు రావుల కిష్టయ్యగౌడ్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. మంగళవారం బాధిత కుటుంబాన్ని గౌడ సంఘం నాయకులతో కలిసి ఆయన పరామర్శించారు. ఈ సందర్భంగా ఆ కుటుంబానికి గౌడ సంఘం ఆధ్వర్యంలో రూ.5 వేలు ఆర్థిక సాయం అందజేశారు. అనంతరం అల్లాజీగౌడ్ మాట్లాడుతూ గౌడ కులస్తులను ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో కడ్తాల్, ఆమనగల్లు, కల్వకుర్తి మండలాల గౌడ సంఘం అధ్యక్షులు మాలే మల్లేశ్‌గౌడ్, నిరంజన్‌గౌడ్, దామోదర్‌గౌడ్, నాయకులు సుధాకర్‌గౌడ్, బాలస్వామిగౌడ్, రాజేందర్, బాలస్వామిగౌడ్, యాదయ్యగౌడ్, కేశవులుగౌడ్, శంకరయ్యగౌడ్ తదితరులు ఉన్నారు.

ఘనంగా రేణుకా ఎల్లమ్మ బోనాలు



కడ్తాల్: రేణుక ఎల్లమ్మ బోనాల ఊరేగింపు

కడ్తాల్: మండల కేంద్రంలో రేణుకా ఎల్లమ్మ బోనాల పండుగను మంగళవారం సాయంత్రం గ్రామ ప్రజలు అత్యంత భక్తి శ్రద్ధలతో వైభవంగా నిర్వహించారు. ఉత్సవాల్లో భాగంగా మహిళలు పసుపు కుంకుమలతో.. రంగరంగులతో బోనం కుండలను చూడ ముచ్చటగా అలంకరించారు. నెత్తిన బోనంతో ఊరేగింపుగా వెళ్లి అమ్మవారికి నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. పాడి పంటలతో చల్లంగా చూడాలని వేడుకున్నారు. ఈ సందర్భంగా డప్పు దరువులు, యువకుల నృత్యాలు, పోతరాజుల విన్యాసాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో సర్పంచ్ లక్ష్మీనర్సింహారెడ్డి, ఎంపీటీసీ శ్రీనివాస్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ లక్ష్మయ్య, బీక్యానాయక్, రాఘవేందర్, బీచ్యానాయక్, నర్సింహ, రాంచందర్, మహేశ్ తదితరులు పాల్గొన్నారు.


ప్రత్యేక పూజలు

కడ్తాల్: మండలంలో రేణుక ఎల్లమ్మ దేవత బోనాల ఉత్సవాలను పురస్కరించుకుని మంగళవారం స్థానిక సర్పంచ్ లక్ష్మీనర్సింహారెడ్డి ఆధ్వర్యంలో ప్రజాప్రతినిధులు, ఉత్సవ కమిటీ నాయకులు ఆలయంలో ప్రత్యేక పూజలు జరిపారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ ఆధ్యాత్మిక కార్యక్రమాలతో గ్రామాల్లో ఐక్యత, స్నేహభావం పెంపొందుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో కోఆప్షన్ సభ్యుడు జహంగీర్‌బాబా, మార్కెట్ డైరెక్టర్ లాయక్‌అలీ, పోచమ్మ ఆలయ చైర్మన్ సత్యంయాదవ్, మాజీ ఎంపీటీసీ లక్ష్మయ్య, నాయకులు నరేందర్‌రెడ్డి, మల్లేశ్‌గౌడ్, కరుణాకర్ ఉన్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన

యాచారం: ఎన్నికల దృష్ట్యా ఎంపీడీఓ విజయలక్ష్మి, ఎస్ఐ వెంకటనారాయణ మంగళవారం పలు గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. తమ్మలోనిగూడ, చింతపట్ల తదితర గ్రామాల్లోని గతంలో ఎన్నికల కోసం ఉపయోగించిన ప్రభుత్వ పాఠశాలల భవనాలను పరిశీలించారు. పోలింగ్ కేంద్రాల్లో తాగునీటి సౌకర్యం, మరుగుదొడ్లు, మూత్రశాలలు, విద్యుత్ సౌకర్యం, వాహనాల రాకపోకలకు రోడ్డు మార్గం తదితర సౌకర్యాలను పరిశీలించారు. అదే విధంగా ర్యాంపులను కూడ పరిశీలించారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు తనిఖీలు చేపడుతున్నట్లు ఎంపీడీఓ తెలిపారు.

కాంగ్రెస్ మండల అధ్యక్షుడిగా జగన్



ఆమనగల్లు: కాంగ్రెస్ పార్టీ ఆమనగల్లు మండల అధ్యక్షుడిగా మాలెపల్లి గ్రామ మాజీ ఉపసర్పంచ్ జగన్ నియమితులయ్యారు. ఈ మేరకు పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ మహేశ్‌కుమార్‌గౌడ్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా జగన్ మాట్లాడుతూ మండలంలో పార్టీ బలోపేతానికి కృషి చేస్తామని చెప్పారు. ఈ సందర్భంగా సీడబ్ల్యూసీ ప్రత్యేక ఆహ్వానితులు చల్లా వంశీచంద్‌రెడ్డి, పీసీసీ సభ్యులు శ్రీనివాస్‌గౌడ్, నాయకులు శ్రీపాతి శ్రీనివాస్‌రెడ్డి, వెంకటరమణారెడ్డికి జగన్ కృతజ్ఞతలు తెలిపారు.

చర్యలు తీసుకోండి



ప్రతీమాసింగ్‌కు వినతిపత్రం అందజేస్తున్న టీయూపీఎస్ నాయకులు

ఇబ్రహీంపట్నం రూరల్: తప్పుడు ధ్రువపత్రాలను సమర్పించి బదిలీపై వచ్చిన ఉపాధ్యాయులపై చర్యలు తీసుకోవాలని టీపీయూఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి రమేశ్, రవి డిమాండ్ చేశారు. మంగళవారం జిల్లా అడిషనల్ కలెక్టర్ ప్రతీమాసింగ్‌కు వినతిపత్రం అందజేశారు. 2023 ప్రమోషన్లు, ప్రత్యేక కేటగిరి కింద లబ్ధిపొందేందుకు కొందరు ఉపాధ్యాయులు తప్పుడు ధ్రువీకరణ పత్రాలను సమర్పించారన్నారు. ఇలాంటి వారిని గుర్తించి, అర్హులకు న్యాయం చేయాలని కోరారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

ఇబ్రహీంపట్నం రూరల్: చెట్ల కొమ్మలు తొలగించడం కారణం వలన నేడు పోల్కంపల్లి గ్రామానికి విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఇబ్రహీంపట్నం విద్యుత్ శాఖ ఏఈ శ్రీనివాస్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు . రాయపోల్ సబ్‌స్టేషన్ పరిధిలోని పోల్కంపల్లిలో విద్యుత్ సరఫరాకు అంతరాయం కల్గిస్తున్న చెట్ల కొమ్మలు తొలగిస్తామని తెలిపారు. అందువల్ల ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామన్నారు. ఈ అసౌకార్యానికి ప్రజలు సహకరించాలని కోరారు.

72వ రోజుకు దీక్షలు



గట్టుఇప్పలపల్లిలో దీక్షలు చేస్తున్న జేఏసీ నాయకులు

తలకొండపల్లి: గట్టుఇప్పలపల్లి గ్రామాన్ని మండల కేంద్రంగా ఏర్పాటు చేయాలని జేఏసీ ఆధ్వర్యంలో నిరాహార దీక్షలు చేస్తున్నారు. మంగళవారానికి 72వ రోజుకు దీక్షలు చేరుకున్నాయి. ఈ సందర్భంగా జేఏసీ నాయకుడు డేవిడ్ మాట్లాడుతూ గ్రామాన్ని మండలముగా ఏర్పాటు చేస్తే మరింత అభివృద్ధి చెందుతామని అన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం, అధికారులు స్పందించి ప్రజల కోరిక తీర్చాలన్నారు. కార్యక్రమంలో జేఏసీ నాయకులు దామోదర్, పాపిరెడ్డి, జంగయ్య, చెన్నయ్య, మల్లారెడ్డి, బాలయ్య, నర్సింహ, ఆంజనేయులు, బుచ్చయ్య, అంజయ్య, రేణురెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



ఆమనగల్లులో మాట్లాడుతున్న ఆచారి

జైపాల్‌యాదవ్‌కు ఓటమి తప్పదు

- అవినీతి పాలనకు చరమగీతం
- కల్వకుర్తిలో కాషాయజెండా ఎగురవేస్తాం
- బీజేపీ సీనియర్ నేత ఆచారి

ఆమనగల్లు: మాయమాటలతో ప్రజలను మోసం చేస్తున్న ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్‌కు వచ్చే ఎన్నికల్లో ఓటమి తప్పదని జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యుడు, బీజేపీ నాయకుడు ఆచారి హెచ్చరించారు. కల్వకుర్తి నియోజకవర్గాన్ని అభివృద్ధి చేయడంలో ఆయన పూర్తిగా విఫలమయ్యారని విమర్శించారు. ఎన్నికలు సమీపిస్తుండటంతో ప్రజలను మభ్యపెట్టేందుకు ప్రయత్నిస్తున్నారని మండిపడ్డారు. మంగళవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ జైపాల్‌యాదవ్ నాలుగున్నరేళ్లుగా నిద్రమత్తులో ఉన్నారని, ఇప్పుడు నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తున్నానంటూ డ్రామాలు ఆడుతున్నారని విమర్శించారు. మూడుసార్లు ఎమ్మెల్యేగా పనిచేసిన ఆయన నియోజకవర్గానికి చేసిందేమిలేదన్నారు. గత ఎన్నికల్లో సీఎం కేసీఆర్ అనేక హామీలు ఇచ్చారని, ఇప్పటివరకు నెరవేర్చలేదని ఆరోపించారు.

హామీల అమలులో కేసీఆర్ విఫలం

తలకొండపల్లి: రాష్ట్రంలో అవినీతి పాలనకు చరమగీతం పాడుతామని బీజేపీ సీనియర్ నేత ఆచారి స్పష్టం చేశారు. సీఎం కేసీఆర్ పాలనలో రాష్ట్రం అప్పుల ఊబిలో కూరుకుపోయిందన్నారు. కల్వకుర్తిలో కాషాయ జెండాను ఎగురవేస్తామని ధీమా వ్యక్తం చేశారు. మంగళవారం మండల కేంద్రంలో పార్టీ ముఖ్య నాయకులకు దిశానిర్దేశం చేశారు. అనంతరం ఆచారి మాట్లాడుతూ ప్రధానమంత్రి నరేంద్రమోదీ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి పార్టీ బలోపేతానికి కృషి చేయాలన్నారు. వచ్చే ఎన్నికల్లో కేంద్రం, రాష్ట్రంలో బీజేపీ అభ్యర్థులు అఖండ విజయం సాధించడం ఖాయమన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో కేసీఆర్ ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. తాను 40 ఏళ్లుగా ప్రజా ఉద్యమాల్లో పాలుపంచుకుంటున్నాని, ప్రజలకు సేవ చేసే నాయకులను ఎన్నుకోవాలన్నారు. కార్యక్రమంలో బీజేవైఎం రాష్ట్ర అదనపు కార్యదర్శి పాండు, బీజేపీ మండలాధ్యక్షుడు రవిగౌడ్, కిసాన్‌మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు శేఖర్‌రెడ్డి, హరికాంత్, పరమేశ్, రవి, శ్రీను, యాదయ్య, శాంతకుమారి, మహేశ్, కృష్ణ, పాండు, పాషా, బాలకృష్ణ, శివ, ఠాగూర్ తదితరులు పాల్గొన్నారు.

భవన నిర్మాణ పనులు పూర్తిచేయాలి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

ఆమనగల్లు: ఆమనగల్లు పట్టణంలో అసంపూర్తిగా ఉన్న ప్రభుత్వ జూనియర్ కళాశాల భవన నిర్మాణ పనులను వెంటనే పూర్తి చేయాలని మండల ఎస్ఎఫ్ఐ అధ్యక్షుడు ఫరీద్ డిమాండ్ చేశారు. మంగళవారం ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల భవన నిర్మాణ పనులను పూర్తి చేయాలని ర్యాలీగా వెళ్లి.. తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఫరీద్ మాట్లాడుతూ కళాశాల భవన నిర్మాణ పనులు పూర్తి చేయడంలో ప్రజాప్రతినిధులు విఫలమయ్యారని ఆరోపించారు. ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ వెంటనే స్పందించి పనులు పూర్తి చేయించాలని ఆయన కోరారు. అనంతరం తహసీల్దార్ అనితకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు మహేశ్, సిద్ధు, శివ, రాజేశ్, విద్యార్థులు పాల్గొన్నారు.

గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి తోడ్పాటు

కాంగ్రెస్ నాయకుడు రాఘవేందర్‌రెడ్డి



సీసీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభిస్తున్న రాఘవేందర్‌రెడ్డి

ఆమనగల్లు: గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి ఐక్యత ఫౌండేషన్ ఆధ్వర్యంలో తోడ్పాటు అందిస్తున్నామని కాంగ్రెస్ నాయకుడు, ఆ సంస్థ చైర్మన్ రాఘవేందర్ రెడ్డి తెలిపారు. ఆమనగల్లు మున్సిపాలిటీ పరిధిలోని జంగారెడ్డిపల్లి గ్రామంలో సీసీ రోడ్ల నిర్మాణానికి ఆయన వ్యక్తిగతంగా రూ.6 లక్షల నిధులు అందజేశారు. మంగళవారం గ్రామంలో రోడ్ల నిర్మాణ పనులు ప్రారంభించారు. అంతకు ముందు గ్రామంలోని హనుమాన్‌గుడి ప్రహరీ నిర్మాణానికి రూ.50 వేలు ఆర్థిక సాయం అందజేశారు. ఈ సందర్భంగా రాఘవేందర్‌రెడ్డి మాట్లాడుతూ గ్రామాల్లో ప్రజల సమస్యల పరిష్కారానికి తనవంతుగా కృషి చేస్తున్నట్లు చెప్పారు. ఇప్పటికే అనేక గ్రామాల్లో ప్రజలకు రక్షిత తాగునీరు అందించడానికి ఆర్‌ఓ ప్లాంట్లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అనేక గ్రామాల్లో సొంత నిధులతో సీసీ రోడ్లు నిర్మించినట్లు ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రాములు, పట్టణాధ్యక్షుడు మానయ్య, మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు రాజశేఖర్, నాయకులు కృష్ణ, మైసయ్య, రవియాదవ్ పాల్గొన్నారు.

ఉచిత డ్రైవింగ్ లైసెన్స్ క్యాంపు

మాడ్గుల మండలం ఇర్విన్ గ్రామంలో ఐక్యత ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత డ్రైవింగ్ లైసెన్స్ క్యాంపును రాఘవేందర్‌రెడ్డి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు దశపతిగౌడ్, శ్రీనివాస్‌గౌడ్, యాదయ్య, శివ, సమీర్, సలీం, కిరణ్, పురుషోత్తంరెడ్డి, వెంకటేశ్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

కదం తొక్కిన అంగన్‌వాడీ వర్కర్లు

డిమాండ్ల సాధనకు అంగన్‌వాడీ టీచర్లు, సహాయకులు సమ్మెబాట పట్టారు. గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు సేవలందిస్తున్న అంగన్‌వాడీ టీచర్లు, సహాయకులు చాలీచాలని గౌరవ వేతనంతో ఏళ్ల తరబడి ఇబ్బందులు పడుతున్నారు. అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణ బాధ్యతలతో పాటూ ఇతర పనులను వీరితో ప్రభుత్వం చేయిస్తోంది. ఓటరు నమోదు, కంటివెలుగు, స్వచ్ఛ సర్వేక్షణ్ తదితర కార్యక్రమాల్లో వీరి పాత్ర కీలకం. అంగన్‌వాడీలు లేని ప్రభుత్వ కార్యక్రమాలే ఉండటం లేదు. తమ న్యాయమైన డిమాండ్‌లను పరిష్కరించాలని అంగన్‌వాడీలు సమ్మెకు దిగారు.



ఆమనగల్లు: సమ్మెలో పాల్గొన్న అంగన్‌వాడీ కార్యకర్తలు



కడ్తాల్: ర్యాలీ నిర్వహిస్తున్న అంగన్‌వాడీ ఉద్యోగులు



తలకొండపల్లి: తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న అంగన్‌వాడీలు



యాచారం: బతుకమ్మ ఆడుతూ నిరసన వ్యక్తం చేస్తున్న అంగన్‌వాడీలు



మంచాల: తహసీల్దార్ కార్యాలయం ఎదుట సమ్మె చేస్తున్న అంగన్‌వాడీలు